క్లుప్తంగా

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



సోమేశ్వరంలో గృహ నిర్మాణాలను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో నరేంద్రరెడ్డి

రాయవరం: గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి లబ్ధిదారులకు సూచించారు. మండంలోని సోమేశ్వరంలో జగనన్న లే అవుట్‌ను ఆయన హౌసింగ్ ఏఈ కె.శ్రీనివాసరెడ్డితో కలిపి మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నరేంద్రరెడ్డి మాట్లాడుతూ జగనన్న లే అవుట్లలో ఇళ్ల నిర్మించుకునే వారికి అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. అలాగే లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి అవసరమైన రుణాన్ని కూడా సత్వరం మంజూరు చేస్తుందన్నారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం చేపట్టుకోవాలని సూచించారు. లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

సోమేశ్వరంలో వన మహోత్సవం



సోమగుండం చుట్టూ మొక్కలు నాటుతున్న సర్పంచ్ ఆరిఫ్ తదితరులు

రాయవరం: మండలంలోని సోమేశ్వరంలో మంగళవారం సర్పంచ్ ఆరిఫ్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు మొక్కలు నాటారు. ఆ గ్రామంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి ఆలయం ఎదురుగా గల సోమగుండం చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. సర్పంచ్ ఆరిఫ్ సమక్షంలో సోమగుండం సుందరీకరణలో భాగంగా 2003–04 విద్యా సంవత్సరం విద్యార్థుల సౌజన్యంతో పలు రకాల పూల, నీడనిచ్చే మొక్కలు నాటారు. మొక్కలు నాటిన పూర్వ విద్యార్థులను సర్పంచ్ ఆరిఫ్ అభినందించారు.

కళ్ల కలక రాకుండా ఐ డ్రాప్స్ పంపిణీ



ఐ డ్రాప్స్ పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

మండపేట: కళ్ల కలక సమస్య ఎక్కువగా ఉన్నందున ఆ వ్యాధి బారిన పడకుండా మంగళవారం మండపేట లయన్స్ క్లబ్ వారు ఐ డ్రాప్స్ పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు చెన్నా రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు వద్ద నిర్వహించిన కార్యక్రమంలో 500 మంది ప్రయాణికులకు ఉచితంగా ఐ డ్రాప్స్ అందజేశారు. క్లబ్ సభ్యులు గుండు తాతరాజు, కర్రి నారాయణరెడ్డి, కోనే వీర్రాజు, చక్కా రాంబాబు, కాళ్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

తొలిరోజు నామినేషన్లు నిల్

కాజులూరు: పంచాయతీల్లో ఖాళీగా ఉన్న సర్పంచ్, వార్డు సభ్యుల పదవుల ఉప ఎన్నికలకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసినట్లు ఈఓపీఆర్డీ సీహెచ్ ఇందిరాదేవి తెలిపారు. మంగళవారం తన కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ గొల్లపాలెం పంచాయతీలో పదో వార్డు నెంబరు పోలిశెట్టి వీరేశ్వరరావు మృతి చెందగా ఎన్నిక నిర్వహించాల్సి ఉందన్నారు. ఈ మేరకు మంగళవారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభించామన్నారు. పదో తేదీ గురువారం వరకు నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. 11వ తేదీ శుక్రవారం స్క్రూటినీ నిర్వహించి విత్‌డ్రాలు అనంతరం 14వ తేదీ సోమవారం పోటీదారుల లిస్టు ప్రకటిస్తామన్నారు. 19వ తేదీ శనివారం మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎన్నిక నిర్వహించి లెక్కింపు అనంతరం విజేతను ప్రకటిస్తామన్నారు. కరప మండల ఇంజినీరింగ్ అధికారి వర్ధన్ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ప్రభుత్వం నియమించిందని కాగా తొలిరోజు నామినేషన్లు ఏమీ దాఖలు కాలేదన్నారు.

దిశ యాప్ రక్షణ కవచం

కపిలేశ్వరపురం: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన దిశ యాప్ మహిళలు, విద్యార్థినులకు బలమైన రక్షణ కవచమని దిశ యాప్ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. వల్లూరు గ్రామంలోని కోదండ రామాలయం సమీపంలో మంగళవారం దిశ యాప్, బాల్య వివాహాల నిరోధక చట్టాలపై అవగాహన సమావేశం నిర్వహించారు. మహిళా పోలీసు ప్రమీల, ఐకేపీ సిబ్బంది మాట్లాడుతూ ఆధునికత పేరుతో ఉనికిలోకి వచ్చిన ఎలక్ట్రానిక్ ఆవిష్కరణలను అవగాహనతో వినియోగించుకోవాలన్నారు. వాటిని దుర్వినియోగం చేస్తూ మోసగించే అవకాశాలు ఉంటాయని, వాటి పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌హెచ్‌జీ గ్రూపు సభ్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఒకేసారి వద్దు.. విడతల వారీ ముద్దు

- తూర్పు డెల్టాలో నారుమడుల దశలో వరి
- కాలువ సామర్థ్యానికి మించి నీటి విడుదల
- అయినా పొలాలకు సరిపడని వైనం



శలపాకలో నీరులేక తడి ఆరిపోయి బీటలు వారుతున్న, వెదచల్లిన వరి పొలం

కాజులూరు: అంతా బాగుంది.. కాలం అనుకూలించింది. తొలకరి సాగుకు చొరవ చూపాలని ప్రభుత్వం పదే, పదే సూచిస్తున్నా తూర్పు డెల్టాలో రైతులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఫలితంగా కాలువ ఎగువ, దిగువ ప్రాంతాల్లో రైతులంతా దాదాపు ఒకేసారి సాగుకు చర్యలు చేపట్టడంతో శివారు భూముల్లో పొలాలకు సాగునీరందక తడి ఆరిపోయే పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. తూర్పుడెల్టాలోని మండపేట నియోజకవర్గంలో 47 వేల 618 ఎకరాలు, రామచంద్రపురం నియోజకవర్గంలో 53 వేల 420 ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. దాదాపుగా ఏటా కాలువ ఎగువ ప్రాంతంలో ఉన్న మండపేట నియోజకవర్గ గ్రామాల్లో కొంచెం ముందుగా పనులు ప్రారంభిస్తుంటారు. ఆ పై కాలువ దిగువ భాగంలో ఉన్న రామచంద్రపురం నియోజకవర్గ గ్రామాల్లో దశల వారీగా పనులు జరుగుతుంటాయి. అయితే ఈ ఏడాది రెండు నియోజకవర్గాల్లోనూ ప్రస్తుతం నాట్లు దశ ముమ్మరంగా సాగుతుంది. కొంచెం ముందుగా నారుమడులు, వెదజల్లు వేసిన పొలాల్లో మొక్క ఆకులు తొడిగే దశలో ఉండగా, కొందరు రైతులు ఇప్పుడిప్పుడే విత్తనాలు చల్లగా అవి మొలకలు వచ్చే స్థితిలో ఉన్నాయి. మెరక పొలాల్లో మరికొందరు రైతులు ప్రస్తుతం పంట దమ్ములు చేసే పనిలో ఉన్నారు. ఈ మూడు దశల్లోనూ పొలాలకు సాగునీరు ఎక్కువగా అవసరమౌతుంది. దీంతో కాలువ ఎగువ, దిగువ ప్రాంతాల్లో రైతులందరూ సాగునీరు ఉపయోగిస్తుండటంతో కాలువ శివారు భూముల్లో ఉన్న పొలాలకు నీరు అందడం లేదు. ఫలితంగా కాజులూరు మండలంలోని శలపాక, గొల్లపాలెం, కాజులూరు దుగ్గుదుర్రు, కుయ్యేరు, పల్లిపాలెం తదితర గ్రామాల్లో కాలువ శివారు పొలాలు తడి ఆరిపోయి బీటలు వారుతున్నారు. తూర్పుడెల్టాకు 4800 క్యూసెక్కుల సామర్థ్యం కాగా ఇప్పటికే 4500 పైబడి నీరు విడుదల చేస్తున్నామని అంతకుమించి నీరు విడుదల చేస్తే ఎగువ ప్రాంతంలో కాలువలకు గండ్లుపడే ప్రమాదం ఉందని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. కాలువల సామర్థ్యం మించి నీరు విడుదల చేస్తున్నా రైతులందరికీ ఒకే సారి సాగునీరు అవసరం ఏర్పడటంతో ఇబ్బందులు తలెత్తున్నాయని రైతులు విడతల వారీగా సాగు చేపట్టి ఉండి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని అధికారులు అంటున్నారు.

శివారు భూములకు నీరందించాలి



ఈ ఏడాది వర్షాలు ముఖం చాటేయడంతో పూర్తిగా కాలువ నీటిపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఎగువ, దిగువ ప్రాంత రైతులకు ఒకేసారి నీరు అవసరం రావడంతో శివారు భూములకు నీరు అందడం లేదు. అధికారులు వంతుల వారీ విధానంలో కాలువ శివారు భూములకు ప్రాధాన్యం కల్పించాలి.

– కర్రి దుర్గారెడ్డి, రైతు, శలపాక

వర్షాలు సహకరించలేదు



వాస్తవానికి జూన్ ఒకటినే ప్రభుత్వం డెల్టా కాలువలకు సాగునీరు విడుదల చేసింది. వ్యవసాయాధికారులు గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ముందస్తు సాగుపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. అయితే ఈ ఏడాది వర్షాలు సక్రమంగా పడక పోవటంతో వరి సాగుకు చొరవ చూపలేకపోయాం.

– నల్లమిల్లి బుల్లివెంకటరెడ్డి, రైతు, బందనపూడి

పారిశుధ్య వారోత్సవాలు



ద్రాక్షారామలో అవగాహన కల్పిస్తున్న వైస్ ఎంపీపీ రాజ్యలక్ష్మి, సర్పంచ్ అరుణ తదితరులు

రామచంద్రపురం రూరల్: ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మండలంలో పారిశుధ్య వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎన్.షెలత్‌రాజు తెలిపారు. దీనిలో భాగంగా మంగళవారం ప్రజాప్రతినిధులు ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు, గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల నిర్మూలనకు డ్రైనేజీల్లో ఆయిల్ బాల్స్ వేశారు. డ్రైనేజీల్లో సిల్టు తొలగింపు, మంచి నీటి సరఫరాలో లీకేజీల రిపేర్లు తదితర చర్యలు చేపట్టారు. మేజర్ పంచాయతీ ద్రాక్షారామలో జరిగిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరాల రాజ్యలక్ష్మి, గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా పాల్గొన్నారు.

నేటి నుంచి నా భూమి- నా దేశం

- నేల తల్లికి నమస్కారం – వీరులకు వందనం
- ఈనెల 16 వరకూ గ్రామ, మండల స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు
- పంచాయతీలకు మార్గదర్శకాల జారీ



ఏడిద సీతానగరంలో ఏర్పాటు చేసిన శిలాఫలకం

మండపేట: దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గతేడాది హర్‌ఘర్ తిరంగ పేరిట ప్రతి ఇంటిపై జాతీయ జెండాను రెపరెపలాడించి. అందరిలో స్వాతంత్య్ర స్ఫూర్తిని నింపిన ప్రభుత్వం ఈ ఏడాది నా భూమి– నా దేశం, నేల తల్లికి నమస్కారం – వీరులకు వందనం పేరిట ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణకు ఆదేశాలిచ్చింది. ఈనెల 16 వరకు నిర్వహించాల్సిన కార్యక్రమాలపై మార్గదర్శకాలను విడుదల చేసింది. ప్రతిరోజూ చేసిన కార్యక్రమాలతో సెల్ఫీలు తీసుకుని ప్రత్యేకంగా రూపొందించిన వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని కోరింది. గ్రామాలు, పట్టణంలో సిద్ధం చేసిన శిలా ఫలకాలను ఆవిష్కరణతో బుధవారం వేడుకలు మొదలు కానున్నాయి. శిలా ఫలకాల్లో పొందుపర్చాల్సిన అంశాలపై ప్రత్యేక సూచనలు చేశారు. ప్రతి శిలాఫలకంపై ఆజాదీకా అమృత్ మహోత్సవ్ లోగో, ప్రధాన మంత్రి సూక్తి, స్థానిక వీరుల పేర్లు, గ్రామ పంచాయతీ పేరు, తేదీ ఉండాలి. 10న ప్రతి ఒక్కరు గుప్పెట్లోకి మట్టిని తీసుకుని దీపం వెలిగించి పంచ ప్రాణ ప్రతిష్ట చేయాలి. శిలాఫలకాల చుట్టూ దీపాలు వెలిగించాలి. 11న వసుధకు వందనం పేరిట ప్రతి గ్రామంలో దీర్ఘ కాలం పాటు ఉండే 75 మొక్కలు నాటాలి. 14న వీరులకు వందన పేరిట దేశం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్య్ర సమరయోధులు, ఆర్మీ, నేవీ, వైమానిక తదితర రక్షణ రంగ ఉద్యోగులు, రాష్ట్ర, కేంద్ర పోలీసులకు నివాళులర్పించారు. స్థానిక వీరుల కుటుంబాలూ, ఆయా రంగాల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన వారిని సత్కరించాలి. 15న జాతీయ జెండాను ఎగురవేసి వందన సమర్పణ చేయాలి. 16న మండల, మున్సిపాల్టీ స్థాయిలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలి. అనంతరం 29 వరకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో వేడుకలు జరుగుతాయి. ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నిర్వహిస్తున్న ఈ వేడుకలకు సంబంధించి ఎంపీడీఓలు, పంచాయతీ కార్యదర్శుల విధులపై ప్రభుత్వం మార్గదర్శకాలిచ్చింది.

కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



నా భూమి నాదేశం కార్యక్రమాలు మండలంలో విజయవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. పంచాయతీ సిబ్బందికి ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలిచ్చాం. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో శిలాఫలకాలను సిద్ధం చేశాం.

– ఐ. రాజు, ఎంపీడీఓ, మండపేట

భీమేశ్వరాలయ ఈఓ తారకేశ్వరరావుకు సత్కారం



భీమేశ్వరాలయ ఈఓ తారకేశ్వరరావును సత్కరిస్తున్న సిబ్బంది, పెద్దలు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీ ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ఈఓ. పితాని తారకేశ్వరరావును మంగళవారం సిబ్బంది, స్థానిక పెద్దలు ఘనంగా సత్కరించారు. ఈఓగా బాధ్యతలు తీసుకుని ఏడాది అయిన సందర్భంగా ఆయనను దుశ్శాలువాలు, పూల దండలతో సత్కరించారు. కేక్ కట్ చేసి పంచారు. ఈ ఏడాది కాలంలో ఆలయ అభివృద్ధికి రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ సహకారంతో హోమశాల నిర్మాణం, నూతన రథ నిర్మాణం, సప్త గోదావరి ఆధునీకరణ, సుందరీకరణ వంటి అభివృద్ధి పనులతో పాటు ఆలయంలో దధి సేవ, మాణిక్యాంబా అమ్మవారికి శాకంబరి అలంకరణ, పలు కైంకర్యాల ఏర్పాటుతో భక్తులకు అనుకూలంగా సేవలు పెంచడంపై ఈఓకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాజరాజేశ్వరి పీఠాధిపతి తాళ్ల సాంబశివరావు గురూజీ, చండీ హోమందారు ఇంద్రకంటి రామారావు, ఆర్యవైశ్య సంఘం నాయకుడు చెరుకు బాబూరావు, సామాజిక సేవకుడు కంచర్ల చక్రి, సిబ్బంది మొల్లేటి శ్రీనివాస్, రాజు, వెంకన్నబాబు, సారథి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

లారీ టైరు పేలి అంటుకున్న మంటలు

రావులపాలెం: జాతీయ రహదారిపై వెళుతున్న ఒక లారీ వెనుక టైరుపేలి మంటలు అంటుకున్నాయి. స్థానిక జూనియర్ కళాశాల సమీపంలో మంగళవారం చోటు చేసుకున్న ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. కలకత్తా నుంచి చెన్నై వెళుతున్న కూలింగ్ కంటైనర్ లారీ జూనియర్ కళాశాల జంక్షన్ వద్దకు వచ్చే సరికి వెనుక ఎడమవైపు ఉన్న టైరు పేలడంతో లారీ డ్రైవర్ బండిని పక్కన ఉన్న సర్వీసు రోడ్డులో ఆపాడు. ఇంతలో ఆ టైర్లకు మంటలు అంటుకోవడవంతో స్థానికులు భయాందోళన చెందారు. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది, కొత్తపేట అగ్నిమాపక సిబ్బంది సకాలంలో సంఘటన ప్రాంతానికి చేరుకుని టైర్లకు అంటుకున్న మంటలను అదుపు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ప్రమాదంలో సుమారు రూ.30 వేల వరకూ నష్టం జరిగినట్టు ఫైర్ ఆఫీసర్ పి.శ్రీనివాస్ తెలిపారు.

సురక్షితమైన తాగునీటితో ఆరోగ్య రక్షణ



వల్లూరులో తాగునీటి ప్రాధాన్యతపై అవగాహన ర్యాలీ చేస్తున్న సర్పంచ్, ఉద్యోగులు

కపిలేశ్వరపురం: సురక్షితమైన తాగునీటి వినియోగంతోనే ఆరోగ్య రక్షణ సాధ్యమని వల్లూరు సర్పంచ్ దాసి మీనాకుమారి, పంచాయతీ కార్యదర్శి తాతపూడి సుభాకర్ అన్నారు. స్థానికంగా జల్‌జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం గ్రామ వీధుల్లో తాగునీటి ప్రాధాన్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సచివాలయంలో గ్రామస్తులకు తాగునీటి పరీక్షను చేసే విధానంపై ప్రయోగాత్మకంగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు, వైద్య ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన



కూళ్ల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది



రామచంద్రపురం హైస్కూల్లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న డాక్టర్ సుదర్శన్‌బాబు తదితరులు

కె.గంగవరం: చిన్నారుల్లో అనారోగ్యానికి గురి చేసే నులిపురుగులను నివారించాలని ఎంఈఓ నాగరాజు అన్నారు. మండలంలోని పామర్రు ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ నులిపురుగు నివారణ దినోత్సవంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని దంగేరు, పామర్రు, కుందూరు, పేకేరు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అందరికీ నివారణ మాత్రలు అందిస్తారని పేర్కొన్నారు. వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాఠశాలకు వచ్చి విద్యార్థులకు ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసి వారితో మింగిస్తారని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఒకటి నుంచి 18 సంవత్సరాల వయస్సు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ మాత్రలను వేసుకోవాలన్నారు. ఈ మాత్రలను వేసుకోవడం వల్ల కడుపులోని నులిపురుగులను నివారించవచ్చని తద్వారా విద్యార్థులకు మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని సూచించారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మల్లికార్జునుడు, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రామచంద్రపురంలో..

రామచంద్రపురం: పిల్లల్లో ఏర్పడే రక్తహీనత, పోషకాహార లోపం, నీరసం, ఆందోళన తగ్గించేందుకు నులిపురుగుల మాత్రలు ఆల్బెండజోల్ ఇవ్వాలని రామచంద్రపురం డివిజన్ మెడికల్ ఆఫీసర్ ఆర్.సుదర్శన్‌బాబు సూచించారు. ఈనెల 10న జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమానికి సంబంధించి పట్టణంలోని రత్నంపేట హైస్కూల్ నందు రామచంద్రపురం మండల ఎస్‌డీడీ టాస్క్‌ఫోర్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుదర్శన బాబు నులిపురుగుల దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వటం మూలంగా పిల్లల్లో నులుపురుగులు నశించి చదువుపై ఏకాగ్రతను నేర్చుకునే సామర్థ్యాన్ని పెంచుతుందన్నారు. డాక్టర్లు హేమసుధీర్, లలిత, ఎంఈఓలు ఎం.శ్రీనివాస్, వి.నాగేశ్వరి, డివిజనల్ హెల్త్ సూపర్ వైజర్ జి.కమల్ శేషు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమయానుకూలంగా పంటకు పొటాష్ వేయాలి

కాజులూరు: వరి పంటపై పొటాష్ ఎరువును రైతులు సమయానుకూలంగా వినియోగించాలని ఏవో వి.అశోక్ అన్నారు. మంగళవారం మండలంలోని గొల్లపాలెంలో ఆయన రైతులతో మాట్లాడుతూ పంటదమ్ములో మొదటి దఫాగా 25 కేజీల పొటాష్ ఎరువును విధిగా వేయాలన్నారు. రెండో దఫాగా వరిమొక్క చిరుపొట్ట దశలో మరో 25 కేజీల పొటాష్ ఎరువును వేసినట్లయితే ఓ మోస్తరు తేలికపాటి గాలులకు పంట పడిపోకుండా ఉండి అధిక దిగుబడులకు అవకాశం ఉంటుందన్నారు. మండల గ్రామాల్లో అత్యధిక స్థాయిలో వరి పంట నాట్లు దశలో ఉందన్నారు. వ్యవసాయంలో రైతులు ఎరువుల యాజమాన్య పద్ధతులను సక్రమంగా నిర్వహించినప్పుడే పైరు ఆరోగ్యంగా పెరిగి ఆశించిన దిగుబడులు సాధించగలుగుతారన్నారు.

బ్రహ్మాస్త్రంతో చీడపీడల నివారణ

అంబాజీపేట: పంటలను పట్టి పీడిస్తూ దిగుబడులకు నష్టం కల్గిస్తున్న చీడపీడలను బ్రహ్మాస్త్రంతో నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రాజెక్ట్ రిసోర్స్ పర్సన్ జనుపల్లి నాగవేణి అన్నారు. ముక్కామలలో బ్రహ్మాస్త్రం తయారీ విధానంపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. నాగవేణి మాట్లాడుతూ ఉమ్మెత్త ఆకు 5 కేజీలు, జామ 5 కేజీలు, సీతాఫలం ఆకు 5 కేజీలు, బొప్పాయి ఆకు 5 కేజీలు, వేపాకు 5 కేజీలు సేకరించాలన్నారు. ఈ ఆకులు అన్ని విడివిడిగా దంచి 70 లీటర్ల చేసి, ఆవు మూత్రంలో వేసి 5 పొంగులు వచ్చే వరకు ఉడికించాలన్నారు. ఇలా తయారు అయిన ఈ కషాయాన్ని 48 గంటల తర్వాత వాడుకోవాలన్నారు. ఒక ఎకరానికి 5 లీటర్ల చొప్పున 100 లీటర్ల నీటితో కలిపి స్ప్రే చేసుకోవాలన్నారు. ఇలా స్ప్రే చేయడం వలన పంటపై ఆశించిన పురుగులు, గొంగళి పురుగులు, కాండం తొలచు పురుగు, కాయ తొలచు పురుగులను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ముక్కామల ఐసీఆర్పీ కొప్పిశెట్టి మల్లీశ్వరి, జి. పల్లయ్య, ఎస్‌జీహెచ్ మహిళలు, రైతులు పాల్గొన్నారు.

మాతాశిశు సంరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యం



లబ్ధిదారులకు పోషణ కిట్లు అందిస్తున్న వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావు తదితరులు



నదురుబాదలో పోషణ కిట్లు అందిస్తున్న ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసరావు



కపిలేశ్వరపురంలో పౌష్టికాహార కిట్లు అందుకున్న లబ్ధిదారులతో ప్రజాప్రతినిధులు, అధికారులు

కపిలేశ్వరపురం: మాతా,శిశు సంరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్య వేణి, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు అన్నారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు టేక్ హోమ్ రేషన్ పంపిణీని ప్రారంభించారు. అలాగే తల్లిపాల వారోత్సవాల ముగింపు సందర్భంగా బిడ్డకు తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఐసీడీఎస్ కపిలేశ్వరపురం ప్రాజెక్ట్ సీడీపీఓ అధికారి గజలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం ఈ కార్యక్రమాలు నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ విలువైన, ఖరీదైన పౌష్టికాహారాన్ని పారదర్శకంగా పంపిణీ జరుగుతోందన్నారు. సీడీపీఓ గజలక్ష్మి మాట్లాడుతూ మండలంలో 432 గర్భిణులు, 350 మంది బాలింతలకు 78 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సేవలందుతున్నాయన్నారు. ఎంపీడీఓ, తహసీల్దార్ మాట్లాడుతూ చిరుధాన్యాలు, రాగి పిండి, బెల్లం, చిక్కీలు, ఎండు ఖర్జూరం, పప్పు, వంటనూనె, గుడ్లు, పాలు వినియోగంతో మాతా శిశు సంరక్షణకు దోహదపడుతుందన్నారు. ఐసీడీఎస్ కపిలేశ్వరపురం, టేకి, అంగర సెక్టార్ల సూపర్‌వైజర్లు ఐ.మాణిక్యం, బి.వెంకటలక్ష్మి, ఎస్. పుణ్యవతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

తల్లుల ఆరోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం

రాయవరం: గర్భిణులు, బాలింతల ఆరోగ్య పరిరక్షణకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని నదురుబాదలో మంగళవారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను లబ్ధిదారులకు అందించారు. సర్పంచ్ చింతపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండలంలోని పసలపూడిలో సర్పంచ్ కడలి పద్మావతి, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలకు టేక్‌హోమ్ రేషన్ పంపిణీ చేశారు. ఒక్కో లబ్ధిదారురాలికి టీహెచ్ఆర్‌లో భాగంగా మూడు కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, అర కేజీ నూనె, రెండున్నర లీటర్ల పాలు, 13 కోడిగుడ్లను ఇచ్చారు. ఎంపీటీసీ సభ్యురాలు కర్రి విజేత, వైఎస్సార్‌సీపీ నేతలు మల్లిడి రామారెడ్డి(బాటు), సత్తి వెంకటకృష్ణారెడ్డి, కోరుకొండ వెంకటరమణ పాల్గొన్నారు.

సంపూర్ణ పోషణతో ఆరోగ్యం

కె.గంగవరం: రాష్ట్ర ప్రభుత్వం అందించే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌తో సంపూర్ణ ఆరోగ్యం ఉంటుందని వైస్ ఎంపీపీ దూడల నాగేశ్వరరావు, సర్పంచ్ పిల్లి రాంబాబు అన్నారు. మండలంలోని యర్రపోతవరంలో మంగళవారం బాలింతలు, గర్భిణులకు టేక్ హోం రేషన్ కిట్లను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ రూ.1500 నుంచి రూ.1700 విలువైన పది రకాల ఆహార వస్తువులు ఉన్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. ఆరోగ్యవంతమైన సమాజం కోసమే సీఎం జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. కరోనా కష్టకాలంలో కూడా పేదల సంక్షేమం కోసం నవరత్నాలు అమలు చేసి ప్రజలకు సీఎం అండగా ఉన్నారని గుర్తు చేశారు. ఇకపై ప్రతి నెల సంపూర్ణ పోషణ కిట్లు ఇంటి వద్దకు అందిస్తారని తెలిపారు. మాజీ ఉపసర్పంచ్ మేడిశెట్టి రాంబాబు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మండపేటలో



మండపేటలో టీహెచ్ఆర్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు భవాని తదితరులు

మండపేట: గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ కిట్ల పంపిణీని ఆమె ప్రారంభించారు. వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, ఎంపీడీఓ ఐ. రాజు, సీడీపీఓ గజలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు ప్రాధాన్యతను వివరించారు. రక్తహీనత, పౌష్టికాహార లేమికి గురికాకుండా భావితరాల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం పోషక విలువలతో కూడిన 10 రకాల సరుకులను అందిస్తోందన్నారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నేత కుడిపూడి రాంబాబు, అంగనవాడీ సూపర్‌వైజర్లు సింహాచలం, సత్యవేణి, రత్నకుమారి, సెక్టార్ నాయకులు రాణి, బేబీ, వజ్రం, కుమారి, నాగవేణి పాల్గొన్నారు.

జెడ్ మేడపాడులో..

మండలంలోని జెడ్ మేడపాడులో సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీని వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తోరం శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు దేవు ప్రసాద్‌నాయుడు ప్రారంభించారు. గ్రామంలోని గర్భిణీలు, బాలింతలకు కిట్లు అందజేసి సామూహిక సీమంతాలు నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు తీగిరెడ్డి మహేష్, గెద్దం గాంధీబాబు, పార్టీ నాయకులు విప్పర్తి నాని, మాదిబోయిన రాంబాబు, గండి మేను శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఓటరు సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

మండపేట: ఓటర్ల స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా ఈ నెల 21 వరకు జరిగే ఓటర్ల సర్వేను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని మండపేట ఎలక్షన్ డీటీ అవతార్ మోహర్‌బాబా కోరారు. వివిధ రాజకీయ పార్టీల ఏజెంట్లతో కలిసి బూత్ లెవెల్ అధికారులు సర్వే చేస్తారన్నారు. ఇంటిలోని జనాభా ?, ఎంత మంది ఓటర్లు ఉన్నారు?, 18 సంవత్సరాలు నిండి ఓటుహక్కు నమోదు చేసుకోవాల్సిన వారెందరున్నారు? మరణించిన లేదా ఒక వ్యక్తి రెండు అంత కంటే ఎక్కువ ఓట్లు నమోదు చేసుకుని ఉన్నారా?, ఓటరు లిస్టులో పేర్లు నమోదై తప్పులు సవరణ చేయాల్సి ఉందా? తదితర అంశాలపై సర్వే చేసి సంబంధిత ఎన్నికల ఫారాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. నియోజకవర్గంలో బూత్‌లెవెల్ అధికారులు చేస్తున్న సర్వే విజయవంతానికి ఓటర్లు సహకరించాలని మోహర్‌బాబా మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

గెడ్డర్‌ను ఢీకొట్టిన లారీ

మండపేట: మండలంలోని జెడ్ మేడపాడు రైల్వే గేటు వద్ద భారీ వాహనాల రాకపోకలు నిషేధిస్తూ ఏర్పాటు చేసిన గెడ్డర్‌ను మంగళవారం రాత్రి లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో గెడ్డర్ పడిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు అధిక లోడుతో వేములపల్లి వైపు వెళుతున్న లారీ గెడ్డర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. రూరల్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.